క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం: అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకుడు మైసయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దళితబంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 పెన్షన్ ఇవ్వాలని, తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఐసీఎల్ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకర్

అబ్దుల్లాపూర్‌మెట్: నైపుణ్యాలపై దృష్టి సారించడంతో పాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీఎల్ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్, పీఎం ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు ప్రాంతీయ నోడల్ ఆఫీసర్ అనుముల శ్రీకర్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ క్యాంపస్‌లో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై మంగళవారం ఒకరోజు అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్‌కే రుస్తుం పాల్గొన్నారు.

ఉపాధి సమస్యలపై ఆరా



మల్కీజ్‌గూడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో మంగళవారం కూలీల వద్దకు వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డులున్న ప్రతి కూలీ ఉపాధి పనులకు రావాలని సూచించారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించి ఎండిపోకుండా సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య ఉన్నారు.

రైతు దీక్షకు తరలిన నాయకులు



మాడ్గుల మండలంలో రైతు దీక్షకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

మాడ్గుల: కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని మాజీ వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆమనగల్లులో నిర్వహించిన రైతు దీక్షకు మాడ్గుల నుంచి తరలివెళ్లారు. వీరిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి, డైరెక్టర్ రాజావర్ధన్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, విజయ్, రాజు, నిరంజన్, తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ స్టూడెంట్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు కుమార్, ఇతర సభ్యులు మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ (210) కాలేజీ హాస్టల్స్, ప్రీ మెట్రిక్ హాస్టల్స్ (670) స్కూల్ హాస్టల్స్‌లలో ఉన్న సమస్యలపై గతంలో జీవోలను ప్రభుత్వం ద్వారా సాధించడం జరిగిందని కాని ఇప్పుడు ఉన్న పరిస్థితులలో జీవోలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. గతంలో జారీ చేసిన జీవోలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు బుధవారం సెలవు ఉన్నందున ఎలాంటి క్రయ విక్రయాలు ఉండవని ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెల మూడో బుధవారం రైతు బజార్‌కు సెలవు ఉంటుందని గురువారం యథావిధిగా క్రమవిక్రయాలు కొనసాగుతాయన్నారు.

కలగానే బస్టాండ్!

కడ్తాల్‌లో నిలువ నీడ కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు
- రోడ్డుపైనే వాహనాల నిలుపుదల
- తరుచూ ట్రాఫిక్ సమస్యలు



బస్సు ఎక్కేందుకు రోడ్డుపైనే నిరీక్షిస్తున్న విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. బస్ షెల్టర్లు ఒక చోట ఉండగా.. బస్సులు మరో చోటు నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రధాన రహదారి పక్కన లయన్స్‌క్లబ్ వారు ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. పదిహేను సంవత్సరాలుగా ప్రయాణికులను ఎండా, వానల నుంచి రక్షించింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దీన్ని కూల్చేయడంతో ప్రస్తుతం నిలువ నీడ లేకుండా పోయింది. రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు రెండు చోట్ల బస్ షెల్టర్లు ఏర్పాటు చేసినా, బస్సులను ఇక్కడ నిలపడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వాణిజ్య, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి నిత్యం అనేక మంది వచ్చివెళ్తున్నారు. ఇలాంటి వారికి సేదతీరేందుకు కనీసం నీడ కూడా కరువైంది. గతంలో రోడ్డు విస్తరణ చేపట్టక ముందు, బస్సుల కోసం వేచి ఉండటానికి ప్రధాన రహదారి పక్కన కనీసం చెట్లయినా ఉండేవి. పనుల్లో భాగంగా వీటిని తొలగించడంతో పరిస్థితి దారుణంగా మారింది. ఎండ, దుమ్ములో బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా కడ్తాల్ గ్రామంలో రెండు కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డును నిర్మించారు.

నిత్యం రద్దీ

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుంటాయి. వీటిని బస్ షెల్టర్ల వద్ద కాకుండా రోడ్డు పక్కనే నిలపడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కన నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దుకాణ సముదాయల ఎదుట నిలబడితే యజమానుల నుంచి ఛీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన చోట బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే కేటీఆర్ దీక్షలు



ఆమనగల్లులో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

- సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదు
- పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే మాజీ మంత్రి కేటీఆర్ దొంగ దీక్షలు చేస్తున్నారని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఎన్నికల హామీలను వరుసగా అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టంచేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని వెల్లడించారు. గత ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ మిత్తీకి కూడా సరిపోలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణ, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక కేటీఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మాడ్గుల ప్రాంతంలో రేవంత్‌రెడ్డికి 1,500 ఎకరాల భూమి ఎక్కడ ఉందో చూపించాలని సవాలు విసిరారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల పాపం గత సర్కార్‌దేనని తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ధనుంజయ, ఖలీల్, అలీం, ఖాదర్, ఖరీం తదితరులు పాల్గొన్నారు.

కులగణన రీసర్వేలో అందరూ పాల్గొనండి



కులగణన వివరాలు తెలుసుకుంటున్న రాపోలు జయప్రకాష్

దిల్‌సుఖ్‌నగర్: కులగణ రీసర్వేలో అందరూ పాల్గొనాలని బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కే పురం డివిజన్‌లోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి గతంలో కులగణనలో పాల్గొనని వారిని కలిసి ఈ సారి వివరాలు ఇవ్వాలని కోరారు. కులగణన సర్వేపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని కొంత మంది ఉద్దేశపూర్వకంగానే సర్వేలో పాల్గొనలేదన్నార. కులగణన సర్వేను సమగ్రంగా నిర్వహించేందుకు బీసీ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వేలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర, తల్లాటి రమేష్ నేత, శివ, ధనరాజ్ గౌడ్, గుండా నరసయ్య, జల్లా జగన్నాథం, దోర్నాల చంద్రమౌళి, దుర్గాప్రసాద్, ఆనంద్ కుమార్, ఇమ్రాన్, శ్రీశైలం పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ప్రత్యంగిరా దేవి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవార పసుపు కుంకుమ అలంకరణలో దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో మహిళల సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణ లత, విఠల్ శర్మ, హేమంత్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.

నేడు అన్నాభిషేకం..

దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యంగిరా అమ్మవారికి అన్నాభిషేకం, పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు.

రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం



కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు

మన్సూరాబాద్: హిందూ ధర్మంలో విద్వేషానికి తావులేదని, చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హిందూస్ ఫర్ పూరలిటీ అండ్ ఈక్వాలిటి జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి అన్నారు. ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్‌కాలనీలోని జైభారత్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వేదవాదం –శాంతినాదం వేద సూక్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుళత్వానికి, సమానత్వానికి, ద్వేష రహిత్యానికి హిందూ ధర్మం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. రంగారాజపై దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విజయశంకర్‌స్వామి, రజనీకుమార్, యడ్లపల్లి మోహన్‌రావు, త్రినాథ్, ఉమారాణి, నర్సింహాచార్యులు, సాధు త్రినాథ్, సుబ్రహ్మణ్యశర్మ, లక్ష్మీనారాయణశర్మ, శరణ్‌శర్మ, దత్తాత్రేయశర్మ, గౌరీశంకర్ శర్మ, వసుధాశర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీని నమ్మే పరిస్థితి లేదు

యాచారం: రాష్ట్రంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితి లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజునాయక్ తల్లి రూప్లీబాయి మొదటి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన బొల్లిగుట్టతండాకు చేరుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నందివనపర్తిలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజల మెప్పు పొందలేదన్నారు. హామీల అమలులో ప్రభుత్వం చతికిల పడిందని ఎద్దేవా చేశారు.

కులగణనలో అలసత్వం వహించొద్దు

చాదర్‌ఘాట్: కులగణన సర్వేలో ఎన్యుమరేటర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీసీ జయంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే రెండో దఫాలో మలక్‌పేట్ సర్కిల్‌లో 5307 కుటుంబాల సర్వే చేయాల్సి ఉందన్నారు. గత మూడు రోజుల నుంచి దాదాపు 972 కుటుంబాల వివరాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోని పూర్తిస్థాయిలో సర్వే చేస్తామన్నారు.

మలక్‌పేట్‌లో అధికారులపై విజిలెన్స్ విచారణ

చాదర్‌ఘాట్: మలక్‌పేట్ సర్కిల్–6లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై గత నెల రోజుల నుంచి విచారణ పేరుతో హడావుడి నెలకొంది. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అధికారిపై అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే స్పందించడం లేదని పలువురు మలక్‌పేట్ నుంచి హైదరాబాద్ గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత అధికారికి ఫోన్‌చేసి ఏసీపీకి మెమోతో పాటు విచారణ చేయాల్సిందిగా డీసీకి ఆదేశాలు ఇచ్చారు. శానిటేషన్ సూపర్‌వైజర్ అధికారిపై ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడంలో అవినీతి జరిగిందని పలువురు ఫిర్యాదులు చేయడంపై కమిషన్ విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చారని అధికారులు వెల్లడించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్‌కుమార్ వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట్‌లోని వాహెద్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆజమ్(43), సబాబేగం దంపతులు. వీరికి నలుగురు సంతానం. గత కొన్ని రోజులుగా ఇరువురి నడుమ వివాదం జరుగుతోంది. మనస్తాపానికి గురైన సయ్యద్ ఆజమ మంగళవారం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందాడు.

క్యాట్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

చైతన్యపురి: ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో వీవీనగర్‌లోని పాణినీయ మహా విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. 6–10 తరగతుల 73 మంది విద్యార్థులు పాల్గొనగా 11 మంది ప్రైజ్‌మనీ, 38 మంది మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, నాగేశ్వరరావు,జ్యోతి పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు చర్యలు తీసుకోండి

- డీఆర్‌డీఏ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సక్కుబాయి
- ముకునూర్ నర్సరీలో మొక్కల పరిశీలన



ముకునూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సక్కుబాయి

ఇబ్రహీంపట్నం: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నర్సరీల్లోని మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, ఇందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఏ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సక్కుబాయి సూచించారు. మంగళవారం ముకునూర్ గ్రామ పంచాయతీని సందర్శించిన ఆమె మొక్కలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండాల తీవ్రత పెరుగుతున్నందున నర్సరీల్లో పనిచేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం విధిగా నీళ్లు పట్టాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన పెంచుతున్న మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆమె వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లింగం, నర్సరీ సంరక్షకుడు రాములు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. హయత్‌నగర్ పరిధి కొలను శివారరెడ్డినగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ లెవల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. కాలనీవాసులు అభివృద్ధి పనులను పర్యవేక్షించుకోవాలని కోరారు. కాలనీలో మిగిలి ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొలను నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, మధుసూధన్, వెంకటేష్ నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కదారి యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన దృశ్యం

లింగోజిగూడ: రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ల సముదాయం వద్ద రోడ్డును కబ్జాచేసి చెట్లు పెట్టేందుకు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం స్థానికులు కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ అధికారులు సహకారంతో నిర్మాణాలను తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో భవిష్యత్‌కు అనుగుణంగా అధికారులు అనుమతులు ఇస్తున్నారని అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చాక్లెట్లు పంచితే హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న సత్యంచారి, పద్మానాయక్

హస్తినాపురం: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నందనవనం కాలనీలో రోడ్డుపై కేక్‌కట్ చేసి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తే ఆ పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ ప్రశ్నించారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ వ్యక్తిగతంగా చాలా మంచివారని ఆమె పీఏ చంద్రశేఖర్‌రెడ్డి కావాలని డివిజన్‌లో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు గోదల రఘుమారెడ్డి, సయ్యద్, రమావత్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు రాసే వారిపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: తనపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు రాసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాజీ పీఏ దేవిరెడ్డి సతీష్‌రెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై సోషల్ మీడియా వస్తున్న వార్తలను ఖండిస్తున్నాని నేను ఎక్కడికి వెళ్లలేదని హైదరాబాదులోనే ఉన్నానన్నారు. రాజకీయాలలోనే ఉన్నత విలువలు కలిగిన నాయకుడిగా పేరున్న రాజగోపాల్ రెడ్డి దగ్గర గత 16 ఏళ్లుగా పనిచేస్తున్న నేను రాజగోపాల్ రెడ్డి కానీ.. నా కుటుంబానికి కానీ మచ్చ తెచ్చే పని చెయ్యలేదన్నార. కొన్ని సోషల్ మీడియా వేదికలు బాధ్యతారాహిత్యంగా ప్రచారం చేసిన వార్తలతో నేను నా కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నామన్నారు.

హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి పేర్కొన్నారు. మంగళవారం పుర కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై మున్సిపాలిటీ అనుమతులు లేకుండా అక్రమంగా భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హైడ్రా జోనల్ ఇన్‌చార్జి బి.సుదర్శన్‌రెడ్డి ఇటీవల తుక్కుగూడలో పర్యటించి వీటిని గుర్తించారన్నారు. హైడ్రా ఆదేశాల మేరకు వీటిని తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కందుకూరు: ఆమనగల్లులో నిర్వహిస్తున్న రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీఎత్తున స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించి జేసీబీ యంత్రాలతో గులాబీ పూలను చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కందుకూరు చౌరస్తాతో పాటు దెబ్బడగూడ గేట్ వద్ద పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కంచారు. అనంతరం ఆయన వెంట రైతుదీక్షకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, గణేశ్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొంగల చేతివాటం

కందుకూరు చౌరస్తాలో కేటీఆర్‌కు స్వాగతం పలికే పనుల్లో నాయకులు బిజీగా ఉండటంతో ఇదే అదనుగా దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు. మురళీనగర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్ జేబులో నుంచి రూ.25 వేలు తస్కరించారు. దీంతో అతను కార్యక్రమం అయిన తర్వాత చూసుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

తుక్కుగూడ ఔటర్ వద్ద..

తుక్కుగూడ: ఆమనగల్లులో మంగళవారం చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తుక్కుగూడ ఔటర్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్ రవినాయక్, సుమన్, లావణ్య, నాయకులు తదితరులు ఉన్నారు.